# మరో హంతకుడు

1980 సెప్టెంబరు 20వ తేదీన ఒక ముప్పయ్ సంవత్సరాల వయసు గల యువకుడు కాశీపురం పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు. సాయంత్రం అయిదు గంటలు దాటింది. డ్యూటీలో ఉన్న ఆఫీసరు దగ్గర తన గోడు చెప్పుకున్నాడు.

"సర్. నేను కాశీచరణ రోడ్డులోని దమ్‌దమ్‌లో ఉంటున్నాను. నా పేరు గౌతమ్‌దత్తు" ఆపైన కొంతసేపు గొంతుకు ఏదో అడ్డువడినట్టు ఆగిపోయాడు.

"చెప్పండి. ఏం జరిగింది?" అడిగాడు పోలీస్ ఆఫీసర్ అజయ్ ఘోష్.

ఉబికి వస్తున్న దుఃఖాన్ని టిగమింగుకుంటూ దత్తు చెప్పసాగాడు "నేను డన్‌లప్ ఫౌండ్రీ లిమిటెడ్‌లో అసిస్టెంటు మేనేజర్‌గా పని చేస్తున్నాను. రోజూలాగే ఇవ్వాళ టిఫిన్ చేసి ఆఫీసుకు వెళ్ళాను. నా భార్య గేటువరకూ వచ్చి అలవాటు ప్రకారం నన్ను సాగనంపింది. నేను మధ్యాహ్నం కంపెనీ క్యాంటీన్‌లోనే రోజూ భోజనం చేస్తాను. భోజనానికి ఇంటికి వచ్చే అలవాటు లేదు" ఆగి నిట్టూర్పు విడిచాడు.

మళ్లీ ప్రారంభించాడు- "ఇవ్వాళ అయిదు గంటలకు, రోజూ వచ్చినట్టే ఇంటికి వచ్చాను. సాధారణంగా ఇంటితలుపు వేసి వుంటుంది.

కాని ఇవ్వాళ తలుపు బార్లా తెరచి వుంది. నేను లోపలకు వెళ్ళాను. నా బెడ్ రూంలోని గోద్రెజ్ బీరువా రెండు తలుపులూ తెరచి వున్నాయి. సేఫ్‌లో ఉన్న నగలు కన్పించలేదు. నేను నాభార్య మధును వెతుక్కుంటూ వంటింటిలోకి వెళ్ళాను. అక్కడ దృశ్యం చూసి శిలా ప్రతిమలా నిలబడిపోయాను. ఏం చూస్తున్నానో గ్రహించలేని స్థితిలో ఎంతసేపు ఉన్నానో నాకే తెలియదు'' దుఃఖం పెల్లుబికింది. రెండు చేతులతో ముఖం కప్పుకొని ఏడవసాగాడు.

"ప్లీజ్ చెప్పండి. ఏం జరిగింది?" ఆఫీసరు నెమ్మదిగా అడిగాడు.

''నాభార్య రక్తపు మడుగులో పడివున్నది. ఆమె కంఠంలో శ్వాస నాళిక కోయబడింది. నేను పెద్దగా కేకలు పెట్టాను. ఇరుగు పొరుగు వచ్చారు. నగలే కాక సేఫ్‌లో వున్న మూడు వేల రూపాయలు కూడా హంతకుడు తీసుకెళ్ళాడు" అంతవరకూ చెప్పి గౌతమ్‌దత్తు ఒక్కసారి నిండుకుండ పగిలినట్లు భోరున ఏడ్వసాగాడు.

పోలీస్ ఆఫీసర్ ఘోష్ అతన్ని ఎంతోసేపు ఓదారిస్తేకాని, అతను మళ్ళీ మాట్లాడే స్థితికి రాలేదు.

కలకత్తాలోని దమ్‌దమ్ ప్రాంతం చాలా కోలాహలంగా ఉంటుంది. అటువంటి రద్దీ ప్రదేశంలో ఉన్న ఇంట్లో పట్టపగలు హత్య జరగడం ఘోష్‌కు ఆశ్చర్యాన్ని కలిగించింది.

''సేఫ్‌లో ఏమేమి ఉన్నాయ్?''

వివాహంలో నా భార్యకు ఇరవైతులాల బంగారపు నగలు పుట్టింటివారు పెట్టారు. ఆ తర్వాత నేను నాలుగు తులాల బంగారంతో గాజులు చేయించాను. మొత్తం ఇరవైనాలుగు తులాల బంగారం."

'మీ ఇంట్లో ఇంత బంగారం వున్నదని ఎవరెవరికి తెలుసు?'

'మా బంధువులందరికీ తెలుసు'

అతను ఇచ్చిన రిపోర్టును రాసుకొని ఘోష్ తన సిబ్బందితో దత్తు ఇంటికి బయలుదేరాడు. ఇంటి ముందు జనం గుమికూడి ఉన్నారు. దత్తు ఘోష్‌ను తిన్నగా వంటగదిలోకి తీసుకెళ్ళాడు.

అక్కడ 20 సంవత్సరాల దత్తు భార్య శవం పడివున్నది. ఆమె కంఠం మీద గాయం నుండి ప్రవహించిన రక్తంతో వంట గది గచ్చు తడిసి ఉన్నది. ఆమె చుట్టూ కొన్ని గిన్నెలూ, పళ్ళాలూ చెదిరి పోయి పడివున్నాయి. దాన్ని బట్టి ప్రాణం పోయే ముందు ఆమె బాగా స్ట్రగుల్ అయి వుంటుందని గ్రహించాడు ఘోష్.

గ్యాస్ పొయ్యి మీద సగం ఉడికిన పప్పు గిన్నె వున్నది. గ్యాస్ పొయ్యి ఆర్పి ఉన్నది. హంతకుడు ఆమెను చంపిన తరువాత పొయ్యి ఆర్పి ఉంటాడని గ్రహించాడు ఘోష్. పొయ్యి పక్కగా ఒక పళ్ళెంలో గోధుమపిండి తడిపి ముద్దగా చేస్తూ చేస్తూ మధ్యలోనే వదిలేసి నట్టుగా వున్నది.

ఘోష్ మధు రెండు చేతులూ చూశాడు. చేతులు కడుక్కున్నట్టు వున్నాయి. కాని గోళ్లకు అక్కడక్కడ పిండి అతికి వున్నది. వంటఇంటి కిటికీలు మూసి వుండడాన్ని గమనించాడు. సాధారణంగా వంట పూర్తి కాకుండ కిటికీలు ముయ్యడం జరగదు. వంట ఇంటిని పూర్తిగా పరిశీలించి దత్తుతో ఘోష్ బెడ్ రూంలోకి వెళ్ళాడు.

బీరువా తలుపులు తెరిచి వున్నాయి. తాళం చెవులు సేఫ్‌కు తగిలించి వున్నాయి. బీరువా నిండుగా బట్టలున్నాయ్.

"మిస్టర్ దత్! మీ భార్య తాళం చెవులు సాధారణంగా ఎక్కడ పెడుతుందో మీకు తెలుసా?" అని ఘోష్ అడిగాడు.

దత్తు డ్రెస్సింగ్ టేబుల్‌కేసి ఓ క్షణం చూశాడు. అంతలోనే బెడ్‌కేసి చూస్తూ ''దిండు క్రింద పెడుతుంద''ని చెప్పాడు.

''మీకు బాగా గుర్తుందా? ఆమె /ఇవ్వాళకూడా అక్కడే పెట్టిందా?"

"అవును సర్! నేను ఆఫీసుకి బయలుదేటరేప్పుడు బీరువా తెరచి నాకు ఇరవై రూపాయలు ఇచ్చింది. వెంటనే లాక్ చేసి కీస్ దిండు కింద పెట్టింది.''

ఘోష్ బెడ్‌కేసి చూశాడు. దిండ్లు చక్కగా సర్దిపెట్టి వున్నాయ్. హంతకుడు తాళం చెవుల కొరకు బెడ్ వెదికినట్టు అన్పించలేదు. కొత్త వాడైతే కీస్ కోసం వెతుకుతాడు. దిండ్లు అంత పొందికగా వుండవు. పక్క దుప్పటి కూడా కదిలించినట్టు లేదు. కీస్ ఎక్కడ వుంటాయో బాగా తెలిసిన వ్యక్తే హత్య చేసి వుండాలనిపించింది ఘోష్‌కు. బహుశా బెదిరిస్తే మధు తాళాలు ఎక్కడున్నాయో చెప్పి వుండవచ్చును అనుకున్నాడు.

తాళం చెవులు చేతిలోకి తీసుకున్నాడు. వాటిని పరిశీలనగా చూసి ఆలోచనలో పడ్డాడు. దత్తు ముఖంలోకి తీవ్రంగా చూసి, తాళాలు పోలీసు జవాను చేతికి అందించాడు ఘోష్.

ఘోష్ డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళాడు. అక్కడ సింథాల్ పౌడరు డబ్బా ఉన్నది. ఆ పక్కనే లేత గులాబి రంగులో వున్న గుండ్రటి ప్లాస్టిక్ డబ్బా ఉన్నది. దాని మూత తెరచి చూశాడు.

అందులో కొద్దిగా పౌడరూ, లైట్ బ్లూ పఫ్ కన్పించాయి. పఫ్ చేతిలోకి తీసుకున్నాడు ఘోష్.

వెంటనే ఘోష్ కళ్ళు ఏదో క్లూ దొరికినట్టు తళుక్ మన్నాయి.

"మిస్టర్ దత్! హంతకుడు మీ ఇంట్లోని ప్రతి వస్తువు గురించి తెలిసినవాడై ఉండాలి. అతను రాగానే వంటింటి తలుపు వేశాడు. పిండి కలుపుతూ మధ్యలో అతన్ని చూడగానే మీ భార్య చేతులు ఆదరా బాదరాగా కడుక్కున్నది"

దత్తు కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"అంటే మీ ఉద్దేశ్యం..., నా భార్యకు ఎవడో పరాయి మగాడితో ...."

"మిస్టర్ దత్ - నేను అలా అనలేదు. మీరు అనవసరంగా చాలా దూరం ఆలోచిస్తున్నారు. ఒకటి మాత్రం నిజం! ఈ హత్య కేవలం నగలకోసం, డబ్బుకోసం చేసింది మాత్రం కాదు. ఏదో రహస్యం ఉన్నది"

అంటూ ఘోష్ బయటికి వచ్చాడు. ఇరుగు పొరుగు వాళ్ళను కొన్ని ప్రశ్నలు వేశాడు. కాని అతనికి వారి మాటల్లో క్లూ దొరకలేదు. నిరాశ చెందాడు.

శవ పరీక్షలో బ్లేడుతో గొంతులోని శ్వాస నాళికను కొయ్యడం వల్ల చనిపోయినట్టు తేలింది. ఆమె 10 నుంచి 12 గంటల మధ్య చనిపోయినట్టు డాక్టర్ తేల్చారు.

ఘోష్‌కు కేసుకు సంబంధించి సూత్రం దొరకలేదు. ముందుకు సాగిపోవడానికి సెప్టెంబరు 25న దత్తు పనిచేస్తున్న ఆఫీసుకు వెళ్ళాడు. గౌతమ్ దత్తు పదకొండు గంటలకు తన సెక్రటరీని తీసుకొని బయటికి

వెళ్ళినట్టు చెప్పారు. సెక్రటరీ పేరు శుభాసర్కార్. ఆమె అవివాహిత. ఆమెకు మూడు నెలల క్రితం దత్తు ఉద్యోగం ఇచ్చాడనీ, ఆఫీసులోనూ, బయటా కూడా ఆమెతోనే ఎక్కువ సమయం గడుపుతాడనీ ఘోష్‌కు ఆఫీసువాళ్లు చెప్పారు.

అది విన్న ఘోష్‌కు బుర్ర తిరిగిపోయినట్టు అయింది.

కంపెనీ చౌకీదారును వేరుగా పిలిచి ప్రశ్నలు వేశాడు.

''నువ్వు ఈ కంపెనీలో కావలాదారుగా ఎంతకాలం నుంచి వుంటున్నావ్?''

"దాదాపు పదకొండు ఏళ్లనుంచి''

''అయితే ఇక్కడ పనిచేసే వాళ్లంతా నీకు బాగా తెలిసే వుండాలి''

"తెలుసు సార్!"

"నువ్వు ఎప్పుడూ గేటు దగ్గరే డ్యూటీ చేస్తావా?"

''అవును సర్! పగలంతా నేనే వుంటాను. రాత్రి మాత్రం మరొకడు నన్ను రిలీవ్ చేస్తాడు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు గంటల వరకూ భోజనానికి వెళ్తాను. ఆ సమయంలో గేటు మూసేస్తాను''

''మీ కంపెనీ మేనేజరు గౌతమ్ దత్తు భార్యను ఎవరో హత్య చేశారు. ఆ సంగతి నీకు తెలుసా?''

'తెలుసు సార్! పత్రికలో చదివాను. అందరూ అనుకోవడం కూడా విన్నాను."

''అది జరిగినరోజు నువ్వు డ్యూటీలో వున్నావా?''

ఆ ప్రశ్న వినగానే చౌకీదారు ముఖం వెల వెలా పోయింది.

"నీ ముఖం చూస్తుంటే నీకు ఏదో తెలుసునని నాకు అర్థం అయింది. అబద్ధం చెప్పకు. నిజం చెప్పు? ఏం జరిగింది?'' తీవ్ర స్వరంతో అడిగాడు ఘోష్.

చౌకీదారుకు చెమటలు పట్టాయి.

''ఉదయం గౌతమ్‌గారు కార్ఖానా లోపలకు వెళ్ళడం చూశాను. దాదాపు తొమ్మిదిన్నరకు మేనేజర్‌గారి సెక్రటరీ ఆయన కారులో బయటకు వెళ్లింది.''

''డ్రైవర్ ఉన్నాడా?''

''లేదు. ఆమే కారు నడుపుకుంటూ వెళ్లింది. మళ్ళీ పన్నెండున్నరకు ఆమే కారు నడుపుకుంటూ తిరిగి వచ్చింది.''

మీ మేనేజర్ కార్ఖానాకు వచ్చాక మధ్యలో బయటకు వెళ్లడం చూశావా?

'చూళ్ళేదు సార్!' అని కొంచెం ఆలోచించి 'సార్' అంటూ ఆగాడు.

"ఊఁ చెప్పు!''

సాయంత్రం ఆయన కార్ఖానా నుంచి బయటికి వెళ్తున్నప్పుడు చార్లపట్టు వేసుకున్నారు.

'అయితే'

పొద్దుట లోపలకు వెళ్ళేప్పుడు తెల్లటి షర్టు వేసుకొని ఉన్నారు. ఆయన బయటికి వెళ్లలేదు. సాయంకాలానికి తెల్లషర్టు మార్చి చార్ల షర్టు ఎలా ఎందుకు వేసుకున్నారో నాకు అర్థం కాలేదు.

"ఐ సీ" సాలోచనగా అన్నాడు.

ఘోష్‌కు కేసుకు కావల్సిన క్లూ దొరికినట్లు అనిపించింది. ఉత్సాహంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు.

పెద్ద ఆఫీసర్లతో మాట్లాడి, అ సాయంత్రమే దత్తును ఘోష్ అరెస్టు చేశాడు. తను హత్య చెయలేదని దత్తు వాదించాడు.

"మిస్టర్ దత్! బ్లఫ్ చెయ్యకు. నాకు మొదటిరోజే అనుమానం వచ్చింది. మీరు చిన్న చిన్న తప్పులు చేశారు. మీరు శుభాసర్కార్‌ను ప్రేమిస్తున్నారు. ఆమెను వివాహం చేసుకోవాలనుకున్నారు. అందుకు మీభార్య అడ్డంకి అయింది. ఆమెను ఎలాగయినా వదిలించుకోవడానికి మీరిద్దరూ ప్లాను వేసుకున్నారు. ఆమెను హత్య చేశారు. 20వ తేదీ ఉదయం మీరు తెల్లషర్టు వేసుకొని కార్ఖానాకు వెళ్ళారు. సాయంత్రం నల్లషర్టుతో బయటికి వచ్చారు. అది మీ చౌకీదారు గుర్తించాడు. ఉదయం తొమ్మిదిన్నరకు మీ ఫ్రెండ్ శుభాసర్కార్ కారు నడుపుకుంటూ బయటకు వెళ్ళడం చౌకీదారు చూశాడు. అతను మిమ్మల్ని చూడలేదు. కారు అద్దాలకు కర్టెన్లు ఉన్నాయ్. బహుశా మీరు వెనక సీటు కింద కూర్చుని వుంటారు. కారు దూరంగా ఆపి మీరు ఇంటికి వెళ్ళారు. కారు వెళితే, కారు ఇంటిముందు ఆగివుంటే ఎవరైనా చూస్తారని భయం. కాలినడకతో ఎవరూ చూడకుండా ఇంట్లోకి వెళ్ళారు.

ఆ సమయంలో మీభార్య వంటింట్లో వంటచేస్తున్నది. మీరు ఆమెను కౌగిలించుకోబోయి వుంటారు. ఆమె మిమ్మల్ని ఆపి, అదరా బాదరా చేతులు కడుక్కొని వుంటుంది. ఈలోపల మీరు వంటింటి కిటికీలు మూసి వుంటారు. లేదా మీభార్యే మూసి ఉండవచ్చును.

చేతులు హడావిడిగా కడుక్కోవడం వల్ల ఆమె గోళ్లకు అంటిన పిండి పూర్తిగా వదల్లేదు. ఆమెతో సరసాలు ఆడుతూనే చేతిలో వున్న బ్లేడుతో ఆమె పీక కోశారు. బ్లేడును చేతిలో పట్టుకోవడం-ఆమెకు కనిపించకుండ పట్టుకోవడం తేలిక. మీరు మీ భార్యను హత్యచేశాక గ్యాస్ పొయ్యి ఆర్పేశారు. దోచుకోవడానికి వచ్చినవాడైతే ఆ పని చెయ్యడు. అసలు అతని దృష్టి గ్యాస్ పొయ్యిమీదకు పోదు. పప్పు పొంగి గ్యాస్ ఆరిపోతేతప్ప. ఇంటికి నిప్పు అంటుకుంటుందనే భయంతోనే మీరు ఆ పని చేశారు.

ఈ హత్య డబ్బుకోసం జగిరినట్టు చూపించడానికి మీరు నగలూ, డబ్బూ తీశారు. నేను కీస్ తీసుకున్నప్పుడు నాచేతికి పౌడర్ అంటింది. మీరు మీ కళ్ళముందే ఆ ఉదయం దిండు కింద పెట్టినట్టు అబద్ధం చెప్పారు. పౌడరున్న ప్లాస్టిక్ డబ్బా తెరిచాను. కీస్ అరవడి పౌడర్‌మీద కూడా కన్పించింది.

తర్వాత మీరు షర్టు మార్చుకున్నారు. బహుశా షర్టుమీద రక్తపు మరకలు పడివుంటాయి. ఇక్కడ మీరు పెద్ద పొరపాటు చేశారు. తెల్లషర్టు మార్చి నల్లషర్టు వేసుకొన్నారు. ఆ షర్టు, ఆ నగలూ శోభా సర్కార్ ఇంట్లో దొరకవచ్చును. మావాళ్ళు ఈపాటికి ఆ ఇంట్లోవున్న వస్తువుల్ని పట్టేసే వుంటారు. ఇప్పుడు మీరు అబద్ధం చెప్పినా లాభం లేదు.

హత్యచేసి మళ్ళీ కారు వెనక సీటు కింద కూర్చుని కార్ఖానాకు వెళ్ళారు. సాయంత్రం మామూలుగా బయటికి వచ్చారు. కానీ చౌకీదారు మీ షర్టు గమనించాడు. ఇకచాలా? మర్యాదగా మీ అపరాధాన్ని అంగీకరించండి" అన్నాడు ఘోష్.

అదే సమయంలో శోభ ఇంటికి వెళ్ళిన పోలీసులు తిరిగివచ్చారు. నగలు తెచ్చారు. రక్తపు మరకల్తో వున్న షర్టును తెచ్చారు. అది సెప్టెంబరు 20వ తేదీ "ఆనంద బజార్'' అనే న్యూస్ పేపర్లలో చుట్టి వున్నది.

ఆ తర్వాత దత్తు ఇంటి సోదాల్లో "ఆనందబజార్" న్యూస్ పేపర్లు చక్కగా పేర్చి పెట్టి వున్నాయి. అందులో 20వ తేదీ పత్రిక మాత్రం లేదు.

దత్తు నిలువునా కంపించిపోయాడు. తన అపరాధాన్ని అంగీకరించాడు.

గౌతమ్ వివాహం అయి ఆరు నెలలు కూడా పూర్తి కాలేదు. మధు తల్లిదండ్రులు బాగా కట్నం ఇచ్చారు. దత్తు ఆ వివాహం చేసుకోనన్నాడు. శోభను చేసుకుంటానన్నాడు. కాని అతని తల్లి దండ్రులు అందుకు అంగీకరించలేదు. తల్లిదండ్రుల పట్టుదలవల్ల గౌతమ్ మధును వివాహం చేసుకున్నాడు. కాని శోభమీద ప్రేమ చంపుకోలేకపోయాడు. ఆమెకు తన ఆఫీసులోనే తన సెక్రటరీగా ఉద్యోగం ఇచ్చాడు.

గౌతమ్ తల్లిదండ్రుల ఏకైక సంతానం. ఎం. ఎస్. సి. ప్రథమ శ్రేణిలో పాసయ్యాడు.

కంపెనీ ఇద్దర్నీ ఉద్యోగంలో నుంచి తీసేసింది.

ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తున్నది. గౌతమ్, శోభ బెయిలు మీద విడుదలయ్యారు.

కోర్టు తీర్పు ఎలా ఉంటుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు.

కథా నిలయం
2062
శ్రీకాకుళం